రూ.60 లక్షలతో మంచినీటి పథకం

- ప్రతి ఇంటికి కృష్ణాజలాలు ఆరు నెలల్లోనే అందిస్తా
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: కొత్తపాలెం గ్రామానికి తక్షణమే రూ. 60 లక్షలు మంజూరు చేసి ఆరు నెలల్లోనే ప్రతి ఇంటికి పైపులైన్ల ద్వారా కొళాయిలు ఏర్పాటు చేసి కృష్ణా జలాలు ఆరు నెలల్లోనే అందిస్తానని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మాచవరం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో హాజరై పూలవర్షం కురిపించి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎస్సీ కాలనీలో రూ. 7 లక్షలతో నిర్మించిన చర్చి ప్రహరీ గోడను ప్రారంభించారు. అలాగే ప్రాథమిక పాఠశాల వద్ద రూ. 2 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి ఇప్పటి వరకు అందించిన లబ్ధి గురించి వివరిస్తూ ఇంక ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడుగుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తపాలెం గ్రామంలో ఇప్పటి వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా 700 గృహాలకు రూ. 8.50 కోట్ల సంక్షేమం, లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎన్నికలకు ముందు గ్రామానికి వచ్చినప్పుడు చర్చి ప్రహరీ గోడ కావాలని చెప్పటంతో మన ప్రభుత్వం వచ్చిన వెంటనే నిర్మిస్తానని ఇచ్చిన హామీ ప్రకారం ప్రహరీ గోడ నిర్మించటం జరిగిందని తెలిపారు. వచ్చే వేసవి కల్లా గ్రామంలోని ప్రతి ఇంటికి కొళాయి ద్వారా కృష్ణా జలాలను అందిస్తామని తెలిపారు. గ్రామంలో తనకు మెజార్టీ లేకపోయినప్పటికీ ఒక శాసన సభ్యునిగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని, అందుకే కొత్తపాలెంను అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి రాలేదని, కేవలం ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి గురించి వివరించి, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకొని పరిష్కరించేందుకు వచ్చానని తెలిపారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ప్రకారం ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు.

అభివృద్ధి చూసి గెలిపించండి..

ప్రజలు సంక్షేమం, అభివృద్ధి చూసి మనస్సుతో రాబోయే ఎన్నికల్లో తమను గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సూచించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి లక్ష నుంచి లక్షన్నర వరకు లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. రైతు భరోసా ద్వారా 500 కుటుంబాలకు 55 లక్షల రూపాయలు రైతులకు మేలు జరిగిందన్నారు. టీడీపీ హయాంలో కేవలం రూ. 20 లక్షల లోపే రుణమాఫీ జరిగితే నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రైతులకు రూ. 55 లక్షలు రైతు భరోసా ద్వారా అందించటం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు కూడా బాగా చదువుకోవాలని, వారందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేశారన్నారు. ఈ క్రమంలోనే గ్రామంలోని రెండు పాఠశాలలను కూడా అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. దేశంలోనే ఏ నాయకుడు చేయని విధంగా ప్రతి పేద బిడ్డ చదువుకోవాలని అమ్మ ఒడి పథకాన్ని అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.అమ్మ ఒడి ద్వారా రూ. 70 లక్షలు ఈ గ్రామానికి లబ్ధి చేకూరిందన్నారు. ఆ నాడు చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణమాఫీ చేస్తానన్నాడు కానీ చేయకుండా మహిళలకు ఒట్టి చేయి చూపించాడన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్ల నుంచి డ్వాక్రా గ్రూపుల వడ్డీ రుణమాఫీ చేశారన్నారు. అందులో గ్రామంలో 378 మహిళా గ్రూపులకు ఇప్పటి వరకు రూ. 45 లక్షలు డ్వాక్రా రుణమాఫీ జరిగిందన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన, నవరత్నాల ద్వారా గ్రామానికే రూ. 8.50 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రూ. 40 లక్షలతో గ్రామంలో సచివాలయం నిర్మాణం పూర్తి కానున్నదని తెలిపారు. పరిపాలన ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వలంటీర్లు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. పాలన అంటే ఇది కాదా అని ఈ పాలన మరలా మనకు రావాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, ఎంపీపీ దారం అంబులమ్మ, లక్ష్మీరెడ్డి, కొత్తపాలెం గ్రామ వైఎస్సార్ పార్టీ ఇన్‌ఛార్జి యామని హనుమంతరావు, నాయకులు యామని రామారావు, మునగాల చలమ్మయ్య, చల్లగుండ్ల రామయ్య, యామని కోటేశ్వరరావు, జమ్మిగుంపుల అచ్చయ్య, యామని కోటయ్య, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, కో ఆప్షన్ సభ్యులు షేక్‌జాని, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారావు, ఎంపీటీసీ గురవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు షేక్ అల్లాభక్షు, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ దస్తగిరి, శ్రీనివాస్‌రెడ్డి, మాచవరం సర్పంచ్ నరేష్, పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



గురజాల : ఓటర్ల వివరాల సవరణ ప్రక్రియలో బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ మురళి అన్నారు. మండలంలోని అంబాపురం, చర్లగుడిపాడు, గంగవరం, గురజాల గ్రామాల్లో గల పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఆ బూత్‌ల పరిధిలోని డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లు, పోలింగ్ కేంద్రం మార్పిడి చేసుకున్న వారి ఓట్లను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రీ వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం గురజాలలోని రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మీసాల దానియేలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల ఎస్‌ఐగా కోటయ్య



పిడుగురాళ్ల: పట్టణ ఎస్‌ఐగా కోటయ్య సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో మాచవరం మండలంలో విధులు నిర్వహించి బదిలీపై పిడుగురాళ్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పోలేరమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాసు

గురజాల : మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తిరునాళ్లను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సంగీత విభావరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), పట్టణ కన్వీనర్ కె.అన్నారావు. గ్రామ సర్పంచ్ వి.మల్లయ్య, సురేష్, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, షేక్ పీర్ అహ్మద్ , తదితరులున్నారు.

శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి కోటి తమలపాకుల పూజ



పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని కాలువ కట్ట శ్రీనివాసపురం శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయం ప్రాంగణంలో కోటి తమలపాలకులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు లక్కీడిప్ నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

స్పందనలో డ్వాక్రా మహిళల వినతి



కారెంపూడి: కారెంపూడి గ్రామానికి చెందిన డ్వాక్రా యానిమేటర్ ఉమపై వస్తున్న ఆరోపణలలో నిజం లేదని తగిన చర్యలు తీసుకునే ముందు విచారణ జరపాలని సుమారు 50 మంది డ్వాక్రా మహిళలు స్పందనలో తహసీల్దార్ జి.శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. గత 15 ఏళ్లుగా వెలుగు శాఖలో ఆమె పని చేస్తున్నారని ఎప్పుడూ ఆరోపణలు రాలేదని వారు పేర్కొన్నారు. స్త్రీనిధి రుణ చెల్లింపులు నిధులు ఆమె స్వాహా చేశారని వస్తున్న ఆరోపణలు నిజం కాదని వారు పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్ ఈ విషయం పై అధికారులకు నివేదిస్తానని వారికి హామీ ఇచ్చారు.

9న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సు

దాచేపల్లి : ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సును ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు సిక్కి పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ వినుకొండ అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్ట్రీస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఈ సదస్సును దాచేపల్లిలో నిర్వహిస్తున్నామని, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం, పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, ఏపీఐసీ ల్యాండ్స్, బ్యాంక్ రుణాలు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సలహాలు, సూచనలు ఈ సదస్సులో ఇస్తారని ఆయన వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పరిశ్రమలకు, వాహనాలకు వచ్చే సబ్సిడీపైన కూడా అవగాహన కల్పిస్తామని, నియోజకవర్గ పరిధిలో ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నాలని, పూర్తి వివరాలకు 9059416673 నెంబర్‌ను సంప్రదించాలని అజయ్‌కుమార్ కోరారు.

గులాబి రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన



రైతు పున్నారెడ్డికి లింగాకర్షణ బుట్టలను అందచేస్తున్న కుర్రి సాయి మార్కొండారెడ్డి

రెంటచింతల: పత్తిపంటకు ఆశించే గులాబి రంగు పురుగు నివారణపై రైతులు అవగాహన కలిగిఉండాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టి.టి.డి కళ్యాణమండపంలో బేయర్, ఎల్‌డీసీ కంపెనీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పల్నాడు ప్రాంతంలో బీటీ పత్తి పంటకు ఆశించే గులాబిరంగు పురుగు నిర్మూలనకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను బేయర్, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధులు వివరించడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతందన్నారు. లింగాకర్షణ బుట్టలను ఏ విధంగా పొలంలో అమర్చుకోవాలో ప్రత్యక్షంగా చూపించడంతో రైతులకు అవగాహన ఉంటుందన్నారు. రైతుల శ్రేయస్సు కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలుచేస్తూ వారికి అండగా ఉన్నారన్నారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారుల సూచనలతో సాగు చేసుకోవాలని దీంతో రైతులు తక్కువ పెట్టుబడి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఎక్కువగా పంటలకు వేసుకోవడం వలన తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ అధికారులు రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. బేయర్ కంపెనీ ఆర్ఎం రాజశేఖరం మాట్లాడుతూ పంటలో గులాబిరంగు పురుగు ఉధృతంగా ఉన్నప్పుడు ఎకరాకు 8 లింగాకర్షణ బుట్టలను అక్కడక్కడ అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతిని నివారించవచ్చునన్నారు. అనంతరం 100 మంది రైతులకు సాయి మార్కొండారెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఏరువ ప్రమీల విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా లింగాకర్షణ బుట్టలను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సాయి సంతోష్, ఉపేంద్ర, గంగాధర్, వీవీఏలు, రైతులు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్



న్యాయమూర్తి మురళీగంగాధర్‌రావు

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీ గంగాధరరావు తెలియజేశారు. కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకొని తమ కేసుల నుండి బయటపడాలని సూచించారు. తద్వారా కక్షిదారులు కాలాన్ని డబ్బుని ఆదా చేసుకోవచ్చన్నారు. కేసుల పరిష్కారానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్ నందు సివిల్, క్రిమినల్ కేసులు, మనోవర్తి, చెక్‌బౌన్స్ తదితర కేసులు పరిష్కరించబడతాయని తెలియజేశారు.

మండల సర్వేయర్‌గా సాల్మన్‌రాజ్



మాచర్ల రూరల్: మాచర్ల మండల సర్వేయర్‌గా ఎం సాల్మన్‌రాజ్ నియమితులయ్యారు. ఈయన సర్వే ఆఫీసు ఏడీ నుంచి డిప్యుటేషన్‌పై ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జగనన్న రీ సర్వే వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నిర్దీత సమయంలో రెవిన్యూ సర్వే పనులను అందిస్తామన్నారు.

బ్రాహ్మణపల్లి ఉప సర్పంచ్‌గా సుభాషిణి ఏకగ్రీవం

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి ఉప సర్పంచ్ పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఐదో వార్డు మెంబర్ బిట్రు సుభాషిణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఓటింగ్‌కు పది మంది వార్డు సభ్యులకు గాను ఏడుగురు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంఈవో మల్లికార్జునశర్మ వ్యవహరించారు. సుభాషిణిని ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు

విద్యుత్ ప్రభల వద్ద పూజలు



విద్యుత్ ప్రభ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని మన్సూర్ షాపేటలో వేంచేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. మేళతాళాలతో మహిళలు బోనాలను పురవీధుల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ప్రసాదంను భక్తులకు అందించారు. విద్యుత్ ప్రభల వద్ద కూడా భక్తులు పూజలు చేశారు. స్థానిక శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. విద్యుత్ ప్రభలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, నాయకులు ముశ్యం వెంకటేశ్వర్లు, ముశ్యం ఎర్రబ్బాయి, ఉప్పల రామాంజనేయులు, గద్దల వేదమణి, ముశ్యం సాంబయ్య, ముశ్యం శ్రీనివాసరావు, కొతవరపు ఏడుకొండలు, జయదేవ్, కొతవరపు శ్రీనివాసరావు, వేముల శ్రీహరి, చిన్నం రామ్మూర్తి, కొలా జంపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినూత్నరీతిలో విద్యా బోధన

చలనచిత్రాలు, షార్ట్ ఫిల్మింల ద్వారా సామాజిక చైతన్యం

విలువలు, నైతికత, బాధ్యత, స్ఫూర్తి మిళితమైన విద్యనందిస్తూ సమర్థవంతమైన భావిభారత విద్యార్థులుగా తీర్చిదిద్దాలనే ఆయన సంకల్పం విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక బాధ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు బోధన చేస్తూ వారి యొక్క స్థితిగతులను తెలియజేసే విధంగా రా.. కిట్టూ చలనచిత్రాన్ని నిర్మించి నంది అవార్డు అందుకొని.. తమ బిడ్డలను విద్యార్థులుగా మార్చే అక్షరాల ఒడి బడి. ఆ బడిలో హాయిగా అక్షరాలు దిద్దాలి. భవిష్యత్తును బంగారంగా దిద్ది వారికి వినూత్నమైన రీతిలో ఆటపాటల ద్వారా విద్యనందిస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దటంలో ఆ ఉపాధ్యాయుని కృషి అమూల్యం.



2002లో ప్రపంచ తెలుగు బాలల పండుగలో విద్యార్థులతో కలిసి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు టి.ఎన్. మురళి



టి.ఎన్. మురళి

రూరల్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తెడ్లా నాగ మురళి బోధనతో పాటు ఉత్తమ బాలలను తీర్చిదిద్దేందుకు వారిలో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తూ షార్ట్ ఫిలిం నిర్మాణం చేపట్టారు. అలాగే రా.. కిట్టూ అనే థీరియాటికల్ సినిమాకు దర్శకత్వం వహించారు. ఆ సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ బాలల చిత్రంగా నంది అవార్డు అందుకోవటం విశేషం. అలాగే ట్రైటర్ భారత్ అనే షార్ట్ ఫిల్మింకు అప్పటి ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. సేవ్ గర్ల్స్, రాకాసి, అతి సర్వత్ర వర్జయేత్, నైరాశ్యం, అన్వేషణ, ఆగమ ఛాయ, సామిబువ్వ, శం కుతీర్థం, సత్యమేవజయతే, వృక్షో నమామి, గెలుపు, ఒక టీచర్ కన్నీటి ఉత్తరం, అమ్మ ఒడి, అక్షర సేతు, సర్కారు బడి, సాక్షర యజ్ఞం, మన పాలన మీ సూచన, పదండి పోదాం ప్రభుత్వ బడి వంటి షార్ట్ ఫిల్మింలు నిర్మించి సామాజిక చైతన్యాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిభను గుర్తించి దరఖాస్తు చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయునిగా ఘనంగా సత్కరించింది. సామాజిక బాధ్యతలో విద్యార్థులను తయారు చేస్తూ వారిలోని నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ ఆయన అందించే వినూత్న పద్ధతిలో బోధన అందిస్తూ సామాజిక బాధ్యతలో వారిని చైతన్య పర్చటంలో విశేషంగా కృషి చేస్తున్నారు.

ఉద్యోగిని యోజన మహిళ పథకాన్ని అమలుచేయాలి



తహసీల్దార్ కట్టెకోట పుల్లారావుకు వినతి పత్రాన్ని అందచేస్తున్న జేబీపీ నాయకులు

రెంటచింతల: పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉద్యోగిని యోజన మహిళ పథకాన్ని వెంటనే అమలుచేయాలని జాతీయ బహుజన కళాకారుల రాజ్యాధికార పార్టీ(జేబీపీ) వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు జాతీయ బహుజన కళాకారుల రాజ్యాధికార పార్టీ, జాతీయ గ్రామీణ పేద మహిళా సంక్షేమ సేవా సంఘం ఏపీ ఆధ్వర్యంలో ఉద్యోగిని యోజన మహిళ పథకాన్ని అమలుచేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పేద మహిళల జీవనోపాధి కోసం ఉద్యోగిని యోజన మహిళ పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా అరకొర రుణాలు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలలోని పేద మహిళలకు ఈ పథకం ద్వారా వెంటనే రుణాలు మంజూరు చేసి వారికి ఆర్థిక చేయుతనందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కట్టెకోట పుల్లారావుకు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ గ్రామీణ పేద మహిళా సంక్షేమ సేవా సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పి. పద్మకుమారి, నేతలు ఆర్. మాంగోబాయి, శ్రీదేవి, మేరమ్మ, సత్తమ్మ, చల్లా మల్లేశ్వరి, డి. విశ్రాంతి, ఆర్. జయమ్మ తదితులున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా

సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమరభేరి కార్యక్రమంలో భాగంగా ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పనతో నిరుద్యోగాన్ని రూపుమపుతామని, వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి నేడు నోరు మెదపటం లేదని ఆయన విమర్శించారు. గ్యాస్ సిలిండర్ రూ. 500లకే ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి. శ్రీనివాసరావు, బుంగా నాగేశ్వరరావు, కోటిరెడ్డి, షేక్ హిమాంబి, కవిరేశ్వరమ్మ, నక్క ఆదెమ్మ, జానీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి తదితరులు

సత్తెనపల్లి: పోషకాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, పోషక విలువలతో కూడిన ఆహారం ఎంతో అవసరమని ఆమె సూచించారు. మండలంలోని నందిగామ అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు, కాయగూరల విత్తనాల పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోషకాహార లోపం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ గర్భిణి శరీరంలో పిండం ఏర్పడడానికి, సులువైన ప్రసవం జరగడానికి, ఆరోగ్యమైన శిశువు జననానికి పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. . కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వాణి, మేరీ పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో భూ రీ సర్వే పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్

బొల్లాపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండల కేంద్రంలో రీసర్వేపై సోమ వారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్‌శర్మ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా మండల కేంద్రంలోని భూములను రీసర్వే నేటి నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. రీ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఈ రీ సర్వేలో భూ సరిహద్దు, హక్కు పత్రాలు ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని రైతులు సద్వినియోగపరచుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సుధాకర్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి గురవయ్య, సర్పంచ్ శిఖా జోత్స్న, మండల సర్వేయర్, జి.ఎస్. శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వి.ఆర్.ఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన దేవాలయ ప్రతిష్ట

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రేణుక అంకమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు రేణుకమ్మ తల్లి అమ్మవారిని చీరాల సముద్రానికి తరలించారు. సముద్రస్నానం అనంతరం పొలిమేర వద్దకు తీసుకొచ్చి, అక్కడి నుంచి సాంప్రదాయబద్ధ మేళతాళాలతో శాలివాహన సంఘం సభ్యులు ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల్ని భాగస్వాములు చేయాలి

రాజుపాలెం: గ్రామాల్లో అధికారులు చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధుల్ని భాగస్వాముల్ని చేయాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముందుగా అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, తహసీల్దారు ఏ.బేగం, ఎంఈవో మల్లికార్జునశర్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
ప్రాంతీయ కార్యాలయం, పల్నాడు రోడ్డు, నరసరావుపేట.

బంగారు నగల వేలము ప్రకటన

[illegible] ది.13-09-2023 [illegible]

క్ర.సం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	లోన్ అమౌంట్
1	[illegible]	[illegible]	రూ.2,50,109/-

[illegible]

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com